క్లుప్తంగా

ప్రారంభమైన ఎల్లమ్మతల్లి ఆలయప్రతిష్ట ఉత్సవాలు



ఆలయ ప్రతిష్ట పూజలు చేస్తున్న అర్చకుడు వేదు నాని శర్మ

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఆగమ పండితుడు, ఆలయ ప్రధాన అర్చకుడు వేదుల నాని శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ బి.రమణమ్మ, మాజీ సర్పంచ్ బలగ అప్పలస్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, సూర్యనారాయణ కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు బుధ, గురు వారాలు జరగనున్నాయి. ప్రతిష్ట మహోత్సవాల్లో వేదపండితులు టి. రామ్మోహన్ శర్మ, కర్రి చంద్రశేఖర్ శర్మ, మురళీకుమార్ శర్మ పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో బలగ కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు కలశాలు, పూజాద్రవ్యాలతో పాల్గొన్నారు.

కిశోరీ వికాసంపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సులేఖ

బలిజిపేట: కిశోరీ బాలికలకు వేసవిలో క్రీడలు, వాటి ప్రాముఖ్యత తదితర అంశాలపై నిర్ధారించిన షెడ్యూల్ ప్రకారం సచివాలయాల పరిధిలో అవగాహన నిర్వహించాలని బలిజిపేట సీడీపీఓ సులేఖ అన్నారు. ఈ మేరకు బలిజిపేట వెలుగు శిక్షణ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు కిశోరీ వికాసం వర్క్‌షాపును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేనెల 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోరీ బాలికలకు వేసవి సెలవుల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వివిధ తేదీలలో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో లీగల్ ప్రొహిబిషన్ అధికారి పి.శ్రీధర్, ఓఆర్ డబ్ల్యూ హరికృష్ణ, సూపర్‌వైజర్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వండి



బర్లిలో అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్‌డీ పుష్పారావు

బలిజిపేట: నివాసగృహాల్లో ఉండే చెత్తను దేనికదే వేరుచేసి ఇవ్వడం వల్ల మేలు జరుగుతుందని ఈఓపీఆర్‌డీ పుష్పారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని బర్లి గ్రామస్తులకు తడి చెత్త-పొడిచెత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. రోజూ బండి మీ ఇంటివద్దకు వచ్చేటప్పుడు వేర్వేరుగా చెత్తను అందిస్తే వారు పట్టుకుని వెళ్లిపోతారన్నారు. తడిచెత్త-పొడిచెత్తను అక్కడ వేరువేరుగా ఉంచి సంపద తయారుచేసేందుకు వినియోగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణవేణి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

పార్వతీపురం రూరల్: అగ్నిప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకునేందుకు అవగాహన అవసరమని పార్వతీపురం అగ్నిమాపక శాఖ అధికారి జి.ప్రభాకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రి ఆవరణలో సిబ్బందితో కలిసి ఆస్పత్రి సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణ, అలాగే ప్రమాదాల నుంచి బయట పడే సురక్షిత మార్గాల గురించి అవగాహన కల్పించారు. ఆస్పత్రి, బహుళ అంతస్తుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్ల మార్గం ద్వారా బయటకు వచ్చేందుకు ప్రయత్నించాలని సూచించారు. అలాగే దట్టమైన పొగ అలుముకున్నప్పుడు ముక్కుకు తడిబట్టను కట్టుకుని నేలపై పాకుతూ బయటపడాలని వివరించారు. ఆస్పత్రిలో అగ్నిప్రమాదం సంభవిస్తే ఫైర్ అలారం ఉపయోగించి రోగులను, సిబ్బందిని అప్రమత్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ ఉమామహేశ్వరరావు, ఎ.రమేష్, కేంద్రాస్పత్రి సూపరింటెండెంట్ డా. శివనాగజ్యోతి, ఆస్పత్రి పారామెడికల్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభమైన మక్కువ-చినభోగిలి రోడ్డు పనులు

సీతానగరం: మండలంలోని మక్కువ-చిన భోగిలి బీటీరోడ్డు పనులు పునఃప్రారంభమయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిధులు మంజూరు చేయడంతో అప్పట్లో రోడ్డు పనులు జరుగుతుండగా సార్వత్రిక ఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు అర్థాంతరంగా నిలిచి పోయాయి. తాజాగా పనులను కాంట్రాక్టర్ ప్రారంభించడంతో రోడ్డు పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేయడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు.

పచ్చిరొట్టతో భూమికి మేలు

- అధిక పోషకాలు సమకూరి నేల సారవంతం
- తగ్గనున్న రసాయన ఎరువుల వాడకం
- పెట్టుబడి తగ్గి పెరగనున్న దిగుబడి



సాగుచేస్తున్న పచ్చిరొట్ట

బలిజిపేట:

తక్కువ సారవంతమైన భూముల్లో నల్లటి మట్టిని వేస్తే మంచి దిగుబడులు వస్తాయి. అయితే ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. మట్టిని వేసే బదులు నేలస్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట ఎరువుల సాయంతో భూమిని సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. జీలుగు సాగు చక్కటి ఫలితాలను ఇస్తుంది. జనుము, జీలుగ పైర్లను పువ్వు మొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియదున్నడాన్ని పచ్చిరొట్ట ఎరువుగా గుర్తిస్తారు. పశువుల పేడకంటే పచ్చిరొట్ట భూమిని పదిరెట్లు ఎక్కువ సారవంతం చేస్తుంది. పచ్చిరొట్ట విత్తనాల కింద జీలుగు, జనుము, పిల్లిపెసర ద్వారా భూసారం పెంచుకునేందుకు వీలుగా పొలాల్లో జల్లి పూతకు వచ్చిన తరువాత కలియదున్నితే సేంద్రీయ పదార్థం బాగా పెరుగుతుంది. ఇటీవల ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందిస్తున్నారు.

అవసరమైన వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన వారు ముందుగా వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. 10కిలోల కిట్ ఉంటుంది. దీనిలో 4కిలోలు జీలుగు, 4కిలోల కట్టెలు, 2కిలోల పిల్లిపెసర విత్తనాలు ఉంటాయి. ఈ కిట్టు ఖరీదు రూ.1,296. దీనికి 50శాతం రాయితీపోను రైతు మిగిలింది చెల్లించాల్సి ఉంటుంది.

సాగులో మెలకువలు

- పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువులు విత్తుకోవాలి.
- తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే చల్లుకోవాలి.
- నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం.
- రెండు పంటల మధ్య కాలవ్యవధిలో చల్లుకుని కలియదున్నుకోవచ్చు.

లాభాలు:

- పొలంలో జీలుగును కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని, సూపర్ ఫాస్ఫేట్ అదనంగా అందుతుంది.
- జింక్ మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటకు చేకూరుతాయి. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి.
- నీటి నిల్వ సామర్థ్యం పెంచుతాయి.
- వానపాముల ఉత్పత్తికి దోహదపడతాయి.
- లెగ్యుమినేసి జాతికి చెందిన మొక్కలు కావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది.
- నేల భౌతిక స్థితి మెరుగుపడి భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.
- నేలలో సేంద్రీయ పదార్థం వేయడంతో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- జీవ రసాయన చర్యలతో నేలలో సారం పెరగడమే కాక నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుని ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- నేలలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి.
- భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగపడతాయి.
- కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు.
- భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది.

పచ్చిరొట్ట వేసుకోవడం మేలు

పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవడం వల్ల భూసారం పెరుగుతుంది. రసాయన ఎరువుల భారం తగ్గుతుంది. దిగుబడులు అధికంగా వస్తాయి. సమయానుకూలంగా వేసుకుని పంటవేసేముందు వాటిని భూమిలో కలియదున్నాలి. విత్తనాలు కావాల్సిన వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ఎం.శ్రావణ్‌కుమార్, ఏఓ, బలిజిపేట

గిరిజన ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

పార్వతీపురం: గిరిజన ఎమ్మెల్యేలు మౌనం వీడి ముఖ్యమంత్రితో చర్చించి గిరిజన ప్రత్యేక డీఎస్సీ ప్రకటన చేయించే ప్రయత్నం చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ), గిరిజన విద్యార్థి సంఘం (జీఎస్‌యు), ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్(టీఎస్‌ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కురుపాం, అరకు ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన ఉద్యోగాలను గిరిజనులకే కేటాయిస్తామని, జీఓ నంబర్ 3 తరహా మరో జీఓను తెస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్ గిరిజనులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమ పాఠశాలలో ప్రకటించిన 881 పోస్టులలో 80 పోస్టులు కూడా గిరిజనులకు రిజర్వ్ చేయలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయ పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, మువ్వల అమర్‌నాథ్, పల్ల సురేష్, పాలవలస భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ, కంత పోలమ్మల జాతర



అనంతరాయుడుపేట జాతరలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు



అంజలి రథం మానుతో తిరువీధి చేస్తున్న పూజారి

సీతానగరం: మండలంలోని అనంతరాయుడుపేట గ్రామదేవతలు కంత పోలమ్మ, బంగారమ్మల జాతర ఘనంగా సాగుతోంది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఆరంభమైన జాతర సందర్భంగా మంగళవారం సాయంత్రం అంజలి రథం మాను, కోలాటం, తిరువీధితో పాటు బాజా భజంత్రీలు, పులి వేషాలతో విన్యాసాలు చేసకుంటూ అమ్మవారిఘటాలతో పురవీధుల్లో తిరువీధి చేశారు. బాలికలు చేస్తున్న కోలాటం పలువురిని ఆకట్టుకుంది. బుధవారం ఉదయం అనుపోత్సవం, మొక్కులు తీర్చుకోవడం ఉంటుందని, రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలు, జానపదకళా రూపాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ



యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్ మోహనరావు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని జగన్నాథపురం, చర్చివీధి పట్టణ ఆరోగ్య కేంద్రాలను వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డా. టి. జగన్ మోహనరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యసేవలు అందజేస్తున్న తీరు, ఆరోగ్య పరీక్షల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలపై పర్యవేక్షణ చేసి రికార్డులు తనిఖీచేశారు. ల్యాబ్‌లో పరికరాల పనితీరు తెలుసుకుని, నిర్ధారణ పరీక్షలు, నివేదికల రికార్డులు పరిశీలించారు. ల్యాబ్ పరీక్షల నివేదికలు అందజేయడంలో జాప్యం ఉండకూడదని సిబ్బందికి సూచించారు. మందులు, ఓఆర్‌ఎస్ లభ్యత పరిశీలించారు. అక్కడ చికిత్సకు వచ్చిన రోగుల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డా.జగన్‌మోహన్‌రావు ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించి ప్రగతి నివేదికలు పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌సీడీ సర్వేపై ఆరా తీసి గుర్తించిన దీర్ఘకాలిక రోగుల నివేదికలు పరిశీలించి పురోగతి సాధించాలని కోరారు. సర్వే పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.బి.రవిచంద్ర, డా. వై.గణేష్, డా.ఎం.చాంద్, డీపీహెచ్‌ఎన్‌ఓ ఉషారాణి, సూపర్‌వైజర్లు పుష్ప, ఇందిర వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

హక్కులను హరించేలా డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు తదితరులు

పార్వతీపురం: ప్రజలకు జీవించే హక్కును హరించేలా డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు వ్యాఖ్యలు ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేత సంఘటనలో పేదలకు మద్దతుగా నిలిచి ఉద్యమంలో పాల్గొన్న సీపీఎం కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అసభ్యకరమైన రీతిలో సభ్యసమాజం తలదించుకునేలా రఘురామరాజు వ్యవహరించారన్నారు. ప్రజాఉద్యమంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న శ్రీనివాసరావుపై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన రఘురామరాజు డిప్యూటీ స్పీకర్ పదవికి అనర్హుడని, ఇప్పటికైనా రఘురామరాజు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు బీవీ.రమణ, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

- మే 18లోగా దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్ఎస్.శోభిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ (బాలికలు) పి.కోనవలసలో ఎంపీసీ-40సీట్లు, బైపీసీ-40సీట్లు, సీఈసీ-40, ఏఅండ్‌టీ-20సీట్లు ఉన్నాయన్నారు.
ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ(బాలికలు)కురుపాంలో ఎంపీసీ-40సీట్లు, బైపీసీ-40సీట్లు ఉన్నాయని, ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ (బాలురు) భద్రగిరిలో ఎంపీసీ-40, బైపీసీ-40, సీఈసీ-40సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ (బాలురు) పి.కోనవలసలో ఎంపీసీ-40, బైపీసీ-40, హెచ్ఈసీ-40, ఏఅండ్‌టి-20 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ (బాలికలు), భద్రగిరిలో ఎంపీసీ-40, బైపీసీ-40, హెచ్ఈసీ-40 సీట్లు ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు మే 18వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్:టీడబ్ల్యూఆర్ఈఐఎస్ సెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ప్రజల సమస్యలను పట్టించుకోని కమిషనర్

- జేసీకి ఫిర్యాదు చేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్



జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి తదితరులు

పార్వతీపురంటౌన్: పురపాలక సంఘం సమస్యలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పట్టించుకోవడం లేదంటూ మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వైస్‌చైర్మన్‌లు యిండుపూరు గున్నేశ్వర రావు, జేష్, కొండపల్లి రుక్మిణిలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినప్పటి నుంచి 2025-26 బడ్జెట్ సమావేశాలు నిర్వహించమని అడిగితే కాలయాపన చేస్తున్నారే తప్ప సమావేశాలు నిర్వహించేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఈ నెల 29 అజెండా పంపిస్తానని చెప్పి ఇప్పటికీ స్పందించలేదన్నారు. సమావేశాల కోసం మాట్లాడితే కార్యాలయానికి హాజరు కాని పరిస్థితి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 30 వార్డుల్లో ఉన్న సమస్యల గురించి స్పందన లేకుండా ప్రవర్తించడం బాధాకరమని వాపోయారు. ప్రజల అవసరాలు, సమస్యల పరిష్కారానికి బడ్జెట్ సమావేశాల నిర్వహణకు ఆసక్తి చూపని మున్సిపల్ కమిషనర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయనపై బాధ్యతా రాహిత్యం క్రింద చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కనీసం ప్రోకాల్ పాటించడం లేదు

ప్రోటోకాల్‌కు సంబంధించి కూడా మున్సిపల్ కార్యాలయంలో ఏ కార్యక్రమానికి కూడా పాలకవర్గంలో సభ్యులకు సమాచారం ఇవ్వడంలేదని, తనకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పూర్తిగా ప్రజా సమస్యలు గాలికి వదిలేసి, సమస్యలపై వచ్చిన వారికి మున్సిపల్ అధికారిలా కాకుండా రాజకీయ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కనీసం చైర్పర్సన్, వైస్ చైర్మన్‌లకు ప్రోటోకాల్ పాటించడం లేదంటున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు నిమ్మకాయల సుధీర్, యడ్ల త్రినాథ, చీకటి అనురాధ, సంగంరెడ్డి లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొనన్నారు.


న్యాయం చేయాలి



కుమారుడితో కలసి జిల్లా అధికారులను ఆశ్రయించిన ఉషారాణి

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామానికి చెందిన కింతలి ఉషారాణి తనకు న్యాయం చేయాలంటూ అధికారులను వేడుకుంది. ఇటీవల శిశు సంక్షేమశాఖ గ్రామంలో రెండవ అంగన్వాడీ కేంద్రం హెల్పర్ పోస్టుకు విడుదల చేసిన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోగా అన్ని అర్హత లున్న ఆమెకు ఆ పోస్టును కేటాయించకుండా అర్హత లేని మరో మహిళకు కేటాయించడాన్ని నిరసిస్తూ జిల్లా అధికారులను ఆశ్రయించింది. తమ గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు హెల్పర్ పోస్టును కేటాయించిన మహిళ దగ్గర నుంచి సుమారు రూ.3లక్షలు వసూలు చేసినట్లు ఉషారాణి ఆరోపించింది. ఎలాంటి ఆధారం, భర్తలేని తనకు హెల్పర్ పోస్టుకు అర్హత ఉన్నప్పటికీ ఎందుకు కేటాయించలేదో ఐసీడీఎస్ ఉన్నతాధికారులు బదులివ్వాలని పత్రికాముఖంగా వేడుకుంది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని అందులో ఒకరు దివ్యాంగులని హెల్పర్ పోస్టు తనకు వచ్చినట్‌లైతే తనకు, తన పిల్లలకు జీవనాధారమని ఆవేదన వెళ్లగక్కింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ప్రాధేయపడింది.

వేసవి ఎద్దడిని దృష్టిలో పెట్టుకోవాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం రూరల్: వేసవి ఎద్దడిని అధికారులు దృష్టిలో పెట్టుకుని పార్వతీపురం మండలంలోని తాళ్ల బురిడి, ములగవలస, డోనిగెడ్డ, సందివలస, తొక్కుడువలస, లోవవలస, తాన్నవలస, చొక్కాపువానివలస, బందలుప్పి, బుచ్చింపేట, మెట్టవలస, డీకెపట్నం, టేకులోవతో పాటు పలు గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ఓబీసీ సెల్ నాయకుడు వంగల దాలినాయుడు స్థానిక నాయకులతో కలిసి మండల అభివృద్ధి అధికారిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తాళ్లబురిడి, మరికొన్ని గిరిజన గ్రామాలకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు తెలిపారు. తాళ్లబురిడి గ్రామస్తులు చేసేదేమీ లేక మంచినీటిని కొనుగోలు చేసి తాగుతున్నారన్నారు. అవసరమైతే మంచినీటి ట్యాంకుల ద్వారా ఆయా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని ప్రధానంగా గిరిజన గ్రామాలకు తీవ్ర స్థాయిలో తాగునీటి ఎద్దడి ఉన్నట్లు వివరించారు. అనంతరం వివరాలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ జి.రమేష్ బాబుకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.గౌరీశంకరరావు, బి.రాంబాబు, కె. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో పంట నష్టం



ధ్వంసమైన అరటిగెలలతో ఉన్న తోట




లక్ష్మీపురంలో నేలమట్టమైన రబీవరిచేను



సూరంపేట తోటలో పవర్‌లైన్ స్తంభంపై విరిగి ఇన్సులేటర్ పిన్‌లు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం సాయంత్రం నుంచి రాత్రివరకూ వీచిన ఈదురుగాలి, వర్షానికి రైతులు పంటనష్టానికి గురయ్యారు. లక్ష్మీపురం, వెంకటాపురం, బుడ్డిపేట కాశీపేట గ్రామాల పొలాల్లో ఉన్న రబీవరిచేలు నేల కొరిగి నీటమునిగాయి. లక్ష్మీపురం, కొత్తవలస, పెదంకలాం గ్రామాల్లో పక్వదశకు వచ్చే సమయంలో అరటితోట గెలలు నేలపడిపోయాయి. అలాగే మరిపివలస, సూరంపేట గ్రామాల మధ్య 133 కేవీ లైన్ విద్యుత్ స్తంభాలకు విద్యుత్ వైర్లు అమర్చిన పిన్‌లు, స్తంభాలు వాలిపోవడం వలన రాత్రంతా విద్యుత్ అంతరాయం ఏర్పడింది.అలాగే చిన్నారాయుడుపేట, గుచ్చిమి, బక్కుపేట, బూర్జ, మరిపివలస, సూరంపేట, దయానిధిపురం, జానుమల్లువలస గ్రామాల మామిడి తోటల్లో మామిడి కాయలు రాలి పోవడంతో రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

అనుమతులు లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

పార్వతీపురం: జిల్లావ్యాప్తంగా పలు కోచింగ్ సెంటర్‌ల నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు లూటీ చేస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసెట్, పాలిసెట్, సైనిక, నవోదయ తదితర కోచింగ్‌ల పేరిట నిర్వాహకులు పూర్తిస్థాయిలో అనుమతులు లేకుండా, అలాగే విద్యార్థులకు కావాల్సిన కనీస సదుపాయాలు కల్పించకుండా వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ సైనిక, నవోదయ వంటి ప్రభుత్వ విద్య సంస్థల పేర్లు చెప్పి బినామీ అడ్మిషన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బాధ్యతారహితంగా సెంటర్లు నిర్వహిస్తున్నారని సంబంధిత శాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికాస్, సాయి పాల్గొన్నారు.